బుధేరా చౌరస్తాలో ట్రాఫిక్‌ను దాటుకుంటూ వెళ్తున్న అంబులెన్స్

అంబులెన్స్‌కు దారేది?

మునిపల్లి, ఆగస్టు 23: మునిపల్లి గ్రామానికి వెళ్లాలంటే ప్రధానంగా బుధేరా చౌరస్తాను వినియోగిస్తారు. ముంబయి జాతీయ రహదారిపై ఉన్న బుధేరా చౌరస్తాలో నిత్యం వెల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ చౌరస్తా పోలీస్‌స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలోనే ఉన్నా పోలీసులు ఆటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. శుక్రవారం మునిపల్లి నుంచి సదాశివపేట వైపు వెళ్తున్న 108 అంబులెన్స్ నడిరోడ్డుపై నిలిపిన వాహనాలను దాటుకుంటూ వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ క్రమంలో కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. తర్వాత కొందరు వాహనాలను పక్కకు జరిపి అంబులెన్స్‌కు దారి ఇవ్వడంతో అంబులెన్స వెళ్లిపోయింది. బుధేరా చౌరస్తాలో ఓ పోలీస్ అధికారిని నియమిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగిపోతాయని స్థానికులు కోరుతున్నారు.

ట్రిపుల్ ఆర్ భూముల పరిశీలన

కాసాల శివారులో ట్రిపుల్ ఆర్ భూములను పరిశీలిస్తున్న అధికారులు

హత్నూర, ఆగస్టు 23: హత్నూర మండలంలోని పలుగ్రామాల గుండా నిర్మాణం కానున్న ట్రిపుల్ ఆర్ భూములను శుక్రవారం రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. కాసాల, దేవులపల్లి, దౌల్తాబాద్, సికింద్లాపూర్ గ్రామ శివారుగుండా వెళ్తున్న రీజినల్ రింగ్ రోడ్డు భూములను ఆర్ అండ్‌బీ డీఈ రవీందర్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చుల నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కోట్లతో కోతలు!

- న్యాల్‌కల్ మండలంలో 839 మందికి మొండిచేయి
- బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్న పంట రుణమాఫీ కాని రైతులు

న్యాల్‌కల్ రైతు వేదికలో దరఖాస్తు చేసుకుంటున్న పంట రుణమాఫీ కాని రైతులు

న్యాల్‌కల్, ఆగస్టు 23: కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నట్టు గొప్పగా చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సరిగా అమలు కావడం లేదు. మండల కేంద్రమైన న్యాల్‌కల్, హద్నూర్ గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో 39 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల పరిధిలో 1,294 మంది రైతులను పంట రుణమాఫీకి అర్హులుగా గుర్తించి రూ.12.16 కోట్లతో జాబితాను సిద్ధం చేశారు. మూడు విడతల్లో కలిపి కేవలం 455 మంది రైతులకు రూ.3.39 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయని ఆయా సహకార సంఘాల అధికారులు చెబుతున్నారు. రుణమాఫీపై ఉన్న ఆంక్షలతో 839 మంది రుణమాఫీ కాని రైతులు సహకార సంఘాలు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమకెందుకు రుణమాఫీ కాలేదని సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా కచ్చితమైన సమాచారం ఇవ్వడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణమాఫీ కాని రైతులు పూర్తి వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించడంతో దిక్కుతోచని రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. అర్హులమైన తమకెందుకు రుణమాఫీ కాలేదని సంబంధిత అధికారులను నిలదీస్తున్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేసే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పంట రుణమాఫీపై ఆంక్షలెందుకు?

రూ.2 లక్షలలోపు ఉన్న పంట రుణాలను ఎలాంటి అంక్షలు లేకుండా మాఫీ చేయాలి. మండలంలోని గ్రామాల్లో చాలా మంది రైతులు రుణమాఫీ కాలేదని బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ షరతులు, సాంకేతిక సమస్యతో రుణమాఫీ ప్రక్రియ గందరగోళంగా మారింది. రైతు భరోసా రాక, రుణమాఫీ కాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

- ఎం.రవీందర్, రైతు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, న్యాల్‌కల్ మండలం

విద్యార్థులకు సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న క్రైం డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి, ఆగస్టు 23: ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల దరిదాపుల్లో డ్రగ్స్ ఛాయలు కన్పించొద్దని, విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ క్రైం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కంది మండలంలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన క్రైం డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సెల్‌ఫోన్‌లో తెలియని వాట్సాప్ మేసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఒకవేళ స్పందిస్తే ఖాతాలో ఉన్న డబ్బులు సెకండ్లలో దోచుకుంటారన్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు మత్తుకు బానిసవుతున్నాచని, డ్రగ్స్ జోలికి వెళ్లొద్దని సూచించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులకు గురిచేయొద్దని, సోదరాభావంతో కలిసి మెలిసి విద్యపై దృష్టి సారించాలన్నారు. చాలామంది విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అలాంటి వారు ఇక నుంచి జాగ్రత్తగా చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో అవగాహన

చౌటకూర్, ఆగస్టు 23: సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు సైబర్ నేరాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలోఅవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ హాజరై మాట్లాడారు. అపరిచితుల నుంచి ఈమెయిల్, వాట్సాప్, బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుందన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లు గుర్తిస్తే వెంటనే 1930, లేదా 100కు కాల్ చేసి చెప్పాలన్నారు.

కలెక్టర్ వల్లూరు క్రాంతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కిరణ్‌కుమార్

సహకార శాఖ జిల్లా అధికారిగా కిరణ్‌కుమార్

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 23: సహకార శాఖ జిల్లా అధికారిగా కిరణ్‌కుమార్ బదిలీపై వచ్చారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సహకార శాఖలో ఆర్.కిరణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇప్పటివరకు జిల్లా సహకార శాఖ అధికారిగా పనిచేసిన తుమ్మ ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ వల్లూరు క్రాంతిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జిల్లాలో సహకార శాఖ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అశోక్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన

అశోక్‌నగర్‌లో ఓపెన్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, ఆగస్టు 23: ఆర్సీపురం డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో శుక్రవారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అశోక్‌నగర్, జ్యోతినగర్ మధ్యలో ఉన్న ఓపెన్ డ్రైన్ వర్షాలకు నిండి రోడ్లపై మురుగు నిలుస్తున్నాయని స్థానికులు చెప్పడంతో స్పందించిన కార్పొరేటర్ ఓపెన్ డ్రైన్ నిర్మాణం కోసం రూ.93 లక్షలు మంజూరయ్యాయయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈఈ సురేశ్, డీఈ నరేందర్, ఏఈ ప్రభు, కాలనీవాసులు శేషరెడ్డి, ప్రమోద్‌గౌడ్, ఖలీమ్, పవన్, చారి, సాంబశివరావు, వసంత్‌రెడ్డి, పద్మ, మాలతి పాల్గొన్నారు.

వసతిగృహాల మరమ్మతులకు నిధులు

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి జగదీశ్

రాయికోడ్, ఆగస్టు 23: మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ఎస్సీ, బీసీ వసతి గృహాల మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయని మండల ప్రత్యేక అధికారి జగదీశ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని వసతిగృహాల్లో నెలకొన్న పనుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో రూ.49 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో పనులు పూర్తిచేస్తే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తీరుతాయన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఏఈ పీఆర్ దేవయ్య, ఉపాధిహామీ అధికారి విష్ణు, కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, కేదారినాథ్‌పాటిల్, సతీశ్‌పంతులు, ఏసయ్య ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, ఆగస్టు 23: జహీరాబాద్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 14మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు లబ్ధిదారులకు అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 14 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, విజయ్, అబ్రహం, ఆనందం, పెంటారెడ్డి, సయ్యద్, బస్వరాజ్, మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్, సతీశ్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మార్డి క్రీడా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, ఆగస్టు 23: విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం మండల పరిధిలోని మార్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 68వ మండల స్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో క్రీడారంగం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదన్నారు. తూతూమంత్రంగా శ్రమిస్తే విద్యా, క్రీడల్లో ఆశించిన స్థాయిలో రాణించలేరన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఆణిముత్యాల్లాంటి విద్యార్థులు ఉన్నారని, కఠోరంగా శ్రమిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. సమయాన్ని కాలయాపన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించలేమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, ప్రధానోపాధ్యాయుడు గుండు లక్ష్మణ్, సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీడీలు, నాయకులు పాల్గొన్నారు.

ఈపీఎస్‌ను రద్దు చేయాలి



సీపీఎస్‌ను రద్దు చేయాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 23: సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్(టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ మాట్లాడుతూ పాత పెన్షన్ స్థానంలో 2004 నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లిందన్నారు. సీపీఎస్‌ను కొనసాగిస్తామని ప్రభుత్వం చెప్పడం శోచనీయమన్నారు. సీపీఎస్ స్థానంలో చాలా రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయని చెప్పారు. మేనిఫెస్టోలో చెప్పినట్టుగానే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల కారణంగా చాలా పాఠశాలల్లో ఖాళీలు ఏర్పాడ్డాయని, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయుల వర్క్‌లోడ్ సవరించాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, నాయకులు నాజర్‌పటేల్, మల్లికార్జున్, రాములు, జనార్దన్, శ్రీనివాసచారి, పుండరీకం, చంద్రశేఖర్, రాధ, జయపాల్ పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కల్హేర్, ఆగస్టు 23: ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శించారు. బాధితుల కుటుంబాల ఇంటికి వెళ్లి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్, జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యుడు అలీ, నాయకులు అంజయ్యసాగర్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, పండరి, చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంపల్లిలో చిమ్మచీకట్లు

మునిపల్లి, ఆగస్టు 23: నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. మండలంలోని ఖమ్మంపల్లిలో రాత్రి అయ్యిందంటే చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. ఎక్కడ నుంచి పురుగు పుట్రా దాడి చేస్తాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నెల రోజులుగా మరమ్మతులు చేయకపోవడంతో రాత్రుళ్లు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బాడీ బిల్డర్‌కు ఎమ్మెల్యే అభినందన

బాడీ బిల్డర్ బలరాంను అభినందిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, ఆగస్టు 23: ఇటీవల ఐసీఎన్ ఇండియా నిర్వహించిన జిమ్ బాడీ ఫిట్‌నెస్, 60 కేజీల మెన్స్ ఫిట్‌నెస్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించిన బలరాం, ట్రైనర్ వినోద్‌లను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అభినందించారు. భవిష్యత్‌లో బంగారు పతకాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుధీర్‌రెడ్డి, బరాడి శివ, సాయిరాం, రఘు, ప్రసాద్ పాల్గొన్నారు.

చెరువులో గుర్రపు డెక్కను తొలిగించాలి

రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ సాయికుమార్

మహబూబ్‌సాగర్ చెరువును పరిశీలస్తున్న సాయికుమార్, తదితరులు

సంగారెడ్డి, ఆగస్టు 23: జిల్లా కేంద్రానికి మినీ ట్యాంక్‌బండ్‌గా పిలవబడే మహబూబ్ సాగర్ చెరువులో ఈనెల 21న చేపల మృతి చెందడంతో చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలిగించాలని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువును మత్స్యకారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో చేపల మృతికి ప్రధాన కారణం గుర్రపు డెక్కతోపాటు పట్టణానికి చెందిన మురుగునీరుతో కలుషితమై మృతి చెందాయని టీపీసీసీ వర్కింగ్ చైర్మన్ జగ్గారెడ్డి చెప్పారన్నారు. చెరువులో మత్స్యకారులు ఐదు లక్షల చేపపిల్లలు వదిలితే దాదాపు 90 శాతం చనిపోయినట్లు మత్స్యకారులు తెలిపారని, వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చెరువులో భారీగా పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలిగించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కౌన్సిలర్ వెంకట్‌రాజు, నాయకులు కూన సంతోష్‌కుమార్, పట్టణ మత్స్యకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.

పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ

విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సదాశివపేట, ఆగస్టు 23: మండల పరిధిలోని వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల లైబ్రరీ, రికార్డులను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరుశాతంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుబ్యానాయక్, రామకృష్ణారెడ్డి, సీఆర్పీ నగేశ్ పాల్గొన్నారు.

అప్రమత్తతే మనకు శ్రీరామరక్ష

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న బొల్లారం సీఐ గంగాధర్

బొల్లారం, ఆగస్టు 23: సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాలు, నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొల్లారం సీఐ గంగాధర్ అన్నారు. శుక్రవారం పరిశ్రమల ప్రతినిధులతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయడం, ట్రాఫిక్ రూల్స్, తదితర అంశాలపై వివరించారు. లోన్ యాప్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, క్రెడిట్ కార్డ్స్, ఓటీపీ లింకులు, మెసేజ్‌లు ఓపెన్ చేయొద్దన్నారు. పరిశ్రమల ప్రతినిధులు సైబర్ మోసాలపై కార్మికులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని సూచించారు. పారిశ్రామికవాడలోని రోడ్లపై భారీ వాహనాలను పార్కింగ్ చేయవద్దని, ఓవర్ లోడ్లతో టిప్పర్లను నడిపించవద్దని, రెడీమిక్స్ వాహనదారులు దుమ్ము ధూళి పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్సై దశరథ్, ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందరావు, ప్రతినిధులు రాయుడు, క్రషర్, రెడీమిక్స్ ప్రతినిధులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేశ్

జహీరాబాద్‌లో ఐటీఐని ఏర్పాటు చేయాలి

కోహీర్, ఆగస్టు 23: విద్యార్థులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే జహీరాబాద్‌లో ఐటీఐని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలో స్థానిక ఎస్ఎఫ్ఐ నాయకులతో మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. జహీరాబాద్‌లో ఐటీఐని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, నితిన్, దత్తు పాల్గొన్నారు.

విద్యను నిర్లక్ష్యం చేయొద్దు

కోహీర్, ఆగస్టు 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై నిర్లక్ష్యం చేస్తున్నాయని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ ఆరోపించారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఎస్సీ హాస్టల్ కళాశాల విద్యార్థులకు 'స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో సమానత్వం కోసం పోరాడుదాం'అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ రక్షణకు, సమానత్వ సాధన కోసం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నరేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఒకరికి డెంగీ

కోహీర్, ఆగస్టు 23: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి డెంగీ సోకిందని వైద్యాధికారి డాక్టర్ నవీన్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం పోతిరెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించి డెంగీ సోకిన వ్యక్తి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఆయన అనారోగ్యం బారిన పడడంతో కోహీర్ దవాఖానలో చికిత్స అందించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నదన్నారు. పెద్ద మురుగు కాల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శృతి, వైద్య సిబ్బంది ఉన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 23: వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు శుక్రవారం ఎస్వీ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీసీఐసీ డాక్టర్ కూన వేణుగోపాల కృష్ణ, లీగల్ మెట్రాలజీ డిస్ట్రిక్ట్ ఎన్‌స్పెక్టర్ అనిల్, ఫ్యూయెల్ డ్రాప్ సీఈవో రాధాకృష్ణ, యూనియన్ బ్యాంకు మేనేజర్ సంగీత, కౌన్సిల్ సభ్యుడు ధర్మరాజు మాట్లాడారు. సమాజంలో ఉత్పత్తిదారులు, అమ్మకందారుల నుంచి వినియోగదారులు ఏవిధంగా మోసపోతున్నారనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బొంబాయికాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

పోలీసులు సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఏసీపీ నర్సింహారావు

రామచంద్రాపురం, ఆగస్టు 23: భారతీనగర్ డివిజన్‌లోని బొంబాయికాలనీ, ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీపీ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు ఏసీపీ నర్సింహారావు నేతృత్వంలో పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి 120 ఇండ్లను తనిఖీ చేశారు. ఈ సెర్చ్‌లో మొత్తం 80మంది పోలీసులు పాల్గొన్నారు. అక్రమంగా గంజాయి, డ్రగ్స్, మద్యం అమ్మకాలు, దొంగ వాహనాలు, నంబర్‌ప్లేట్ లేని వాహనాలు, పాత నేరస్తులు, అక్రమ నివాసం ఉంటున్నవారు, అనుమానస్పదంగా తిరిగే వారిని గుర్తించేందుకు బస్తీల్లో కార్డన్ సెర్చ్ చేపట్టారు. బస్తీవాసులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్డన్ సెర్చ్‌లో సరైన పేపర్లు లేని 17 వాహనాలను, ఒక ఆటో, ఓ బెల్ట్ దుకాణం, కొన్ని గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ దొంగతనాలు, నేరాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహించామని, ఇప్పటికే మియాపూర్, చందానగర్‌లో నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు జగన్నాథ్, రామలింగప్రసాద్, పాలవెల్లి, రవీందర్, డీఐ సంజీవులు, ఎస్సైలు శశికాంత్‌రెడ్డి, నర్సింహ, నారాయణగౌడ్, రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబర్ 28న లోక్ అదాలత్

సంగారెడ్డి, ఆగస్టు 23: కోర్టుల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారుల ఒప్పందంతో పరిష్కరించేందుకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబర్ 28న నిర్వహిస్తునట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గతంలో సెప్టెంబర్14న జాతీయ లోక్ అదాలత్ అని ప్రకటించామని, దాన్ని అదేనెల 28కి మార్చినట్లు పేర్కొన్నారు. ఈ ప్రకటనను కక్షిదారులు, న్యాయవాదులు గమనించి పొడిగించిన తేదీలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
ప్రధాన కార్యాలయం: వరంగల్ ప్రాంతీయ కార్యాలయం: సంగారెడ్డి

వేలం అమ్మకం ప్రకటన (బంగారం)

దిగువ తెలిపిన వ్యక్తులకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, వారు తమ రుణ ఖాతాలలో బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా వారికి నోటీసులు పంపబడినవి. అందువల్ల, 31-08-2024న లేదా ఆలోగా బకాయి మొత్తాలు మరియు ఇతర ఛార్జీలు చెల్లించి తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విడిపించుకోవాల్సిందిగా వారు కోరబడుతున్నారు. విఫలమైనచో సదరు సెక్యూరిటీలు 31-08-2024న సా॥ 4.00 గం.కు లేదా తరువాత ఏదేని ఇతర అనుకూలమైన తేదీన బ్యాంక్ పూర్తి విచక్షణ మేరకు తదుపరి నోటీసు లేకుండా సంబంధిత శాఖల వద్ద బ్యాంక్ ఆవరణ వద్ద రుణగ్రహీత ఖర్చుతో బహిరంగ వేలంలో బ్యాంక్ ద్వారా విక్రయించబడతాయి.

క్ర. సం.	బంగారం రుణ ఖాతా నెం.	రుణగ్రహీత పేరు & చిరునామా	బంగారం గ్రాములలో	శాఖ పేరు
1	73212653617	చెవుల సుశీల, భర్త: నాగరాజు, ఇం.నెం. 4-72/2, బొంతపల్లి (గ్రా), జిన్నారం (మం), సంగారెడ్డి (జి), పిన్-502 313.	56.83	బొంతపల్లి (8205) M.No. 8332988640
2	73205357015	ఈడిగ కామాక్షి, తండ్రి: మదన్ గోపాల్, ఇం.నెం. 40, GHMC, ఇంద్రపురి కాలనీ, పటాన్‌చెరు (మం), సంగారెడ్డి (జి), పిన్: 502 319.	35	ఇస్నాపూర్ (8167) M.No. 9490153751

తేది: 23-08-2024 సం/- రీజనల్ మేనేజర్, APGVB, సంగారెడ్డి రీజియన్.